# ఆవు గాండ్రించును

**ఆ**వు 'అంబా' అనును.

గాడిద ఓండ్ర పెట్టును.

కాకి నల్లగా ఉండును.

చింతపండు పుల్లగా ఉండును.

రామ్మూర్తి దేశమును ఉద్ధరించును.

ఈ పై స్టేట్‌మెంట్స్‌లో – మొదటి నాలుగింటిలోనూ ఏమైనా అనుమానానికీ, అసత్యానికీ ఆస్కారం వుంటే వుండొచ్చు కాని, "రామ్మూర్తి దేశాన్ని ఉద్ధరిస్తాడు" అన్న మాటలో మటుకు ఎంతమాత్రం సందేహం లేదు. ఢంకా మీద దెబ్బ కొట్టి చెప్పొచ్చు.

పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్టు రామ్మూర్తి పన్నెండేళ్ళ వయసు నుంచే దేశాన్ని ఉద్ధరించడం మొదలెట్టాడట. అసలు వాళ్ళ వంశమంతా దేశోద్ధారకులూ, దేశసేవకులేనట!

నేను ఇప్పుడుంటున్న టౌనుకి రామ్మూర్తి మునిసిపల్ ఛైర్మన్ కావటంతో, ఆయన దేశోద్ధరణకార్యక్రమాలు కళ్ళారా చూసి తరించే భాగ్యం నాకు లభించింది. పదేళ్ళుగా ఛైర్మన్‌గా వుండి, రామ్మూర్తి టౌన్‌ని చాలా ఉద్ధరించాడు. ఎమ్మెల్యే అయి రాష్ట్రాన్నే ఉద్ధరిద్దామనుకున్నాడు గాని, ఎలక్షన్లలో ఓడిపోయాడు.

అయినా నిరుత్సాహపడకుండా మళ్ళీ ఎలక్షన్లు రాకపోతాయా, కనీసం బై ఎలక్షనన్నా రాకపోతుందా అనే ఆశతో – అకుంఠితమైన దీక్షతో దేశసేవ చేస్తూనే వున్నాడు.

రామ్మూర్తి కేవలం మునిసిపల్ ఛైర్మన్ మాత్రమే కాదు, ఆయనకింకా చాలా పదవులూ, హోదాలూ వున్నాయి. ఒక ప్రధాన రాజకీయ పార్టీ పట్టణసంఘానికి అధ్యక్షుడు, స్థానిక కళాశాల కమిటీకి కోశాధికారి; బియ్యం ఉత్పత్తిదారుల సంఘానికి

గౌరవాధ్యక్షుడు; కోఆపరేటివ్ అర్బన్ బాంక్‌కి అధ్యక్షుడు; మరియూ పట్టణంలోని అనేకానేక సారస్వత సాంస్కృతిక సంఘసేవాసంస్థలకి పోషకుడు, సలహాదారుడూ ఎట్‌సెట్రా.

రామ్మూర్తి ఛైర్మన్ అయిందగ్గర్నుంచీ ఆ టౌన్‌లో రోడ్లు బాగుచేయించుట, చెట్లు నాటించుట, సత్రములు నిర్మించుట, పాఠశాలలు నెలకొల్పుట, ఇత్యాది మంచి పనులు చాలా చేశాడు.

రామ్మూర్తిని కలుసుకోవాలనీ, ఆ మహావ్యక్తితో కాస్సేపు మాట్లాడాలనీ నాకున్న కోరిక మొన్న ఆగస్టు పదిహేనుకి నెరవేరింది.

స్వాతంత్ర్యదినోత్సవం స్కూళ్ళలో తప్పకుండా జరుగుతుంది.

ఆడపిల్లల హైస్కూల్ హెడ్ మిస్ట్రెస్‌కి ఎందుచేతనో గాని, నా మీద అపారమైన గౌరవం ఏర్పడింది. 'స్వాతంత్ర్యదినోత్సవ శుభదినాన మా పాఠశాల యందు జరగబోవు కార్యక్రమమునకు విచ్చేసి ఉపన్యసించవలసి'దని నన్నాహ్వానించి, ఆ గౌరవాన్ని ప్రకటించింది.

సదరు కార్యక్రమంలో చైర్మన్ రామ్మూర్తి గారు జెండా ఎగరేస్తారని కూడా చెప్పింది.

ఓహో! ఎంత అదృష్టం! రామ్మూర్తి వంటి దేశోద్ధారకుడు పాల్గొంటున్న కార్యక్రమంలో ఉపన్యసించడమంటే మాటలా? వెంటనే ఒప్పేసుకున్నాను.

స్వాతంత్ర్యదినోత్సవం ఆడపిల్లల హైస్కూల్లో ఉత్సవస్థాయిలోనే జరిగింది. పంతులమ్మల్లో చాలామంది పట్టుచీరెలు కట్టుకుని, పువ్వులు పెట్టుకుని ముస్తాబై వచ్చారు. కన్నుల పండువగా వుంది. ఎక్కడ చూసినా పువ్వులు.. జెండాలు.

రామ్మూర్తి టౌన్‌లో ఇంకా మూడు నాలుగు చోట్ల జెండాలెగరేసి, రావలసిన సమయానికి అరగంట మాత్రం ఆలస్యంగా వచ్చాడు. వేదికమీదకి రాగానే పిల్లలంతా హర్షధ్వానాలు చేశారు.

ప్రధానోపాధ్యాయిని నన్ను రామ్మూర్తికి పరిచయం చేసింది. "మీ గురించి విన్నాను. మిమ్మల్ని కలుసుకున్నందుకు సంతోషం" అన్నాడు. "ఆహా! ఎంత వినయశీలి!" అనుకున్నాను.

ముందు నేనే మాట్లాడాల్సివచ్చింది.

రామ్మూర్తి లాంటి దేశొద్ధారకుల ఉపన్యాసాలు చాలామందివి చాలా ఏళ్ళుగా వింటూన్నవాణ్ణి గనక, ఇలాంటి సందర్భాల్లో మాట్లాడవలసిందేమిటో కంఠతా వచ్చు నాకు.

ఆ ధైర్యంతోనే లేచి "దేశమును ప్రేమించుడు. దేశాభివృద్ధికై కృషి చేయుడు. వంకాయకూర భుజింపుడు" ఈ ధోరణిలో ఓ అరగంట దంచేసి కూర్చున్నాను.

రామ్మూర్తి ఎలా అయినా గొప్పవాడు. పైగా దేశోద్ధారకుడు. అంచేత నాకంటే ఆయనే గొప్పగా ఉపన్యసించాడు.

స్కూల్ బాగుందన్నాడు. హెడ్‌మిస్ట్రెస్ బాగుందన్నాడు. మన దేశానికి స్వాతంత్ర్యమొచ్చిందన్నాడు. వచ్చి చాలా సంవత్సరాలైందన్నాడు.

ఈ దేశంలో గాంధీ పుట్టాడట; నెహ్రూ పుట్టాడట; తను పుట్టాడట. అంచేత ఈ దేశం గొప్పదన్నాడు.

మీరంతా తలో ఇందిరాగాంధీ కావాలన్నాడు. "మీ స్కూల్‌కి ఏమవసరం వచ్చినా నాతో చెప్పండి" అన్నాడు. "మీకేం అవసరం వచ్చినా నా దగ్గరకి రండి. తీరుస్తాను" అని హెడ్‌మిస్ట్రెస్‌కి సభా ముఖాన వాగ్దానం చేశాడు. లోగడ చాలాసార్లు చాలామంది అవసరాలు తీర్చాట్ట. ఆ మాట కూడా చెప్పాడు.

ఈ రకంగా దాదాపు గంట సేపు అనర్గళంగా ఉపన్యసించి, జెండా ఎగరేశాడు.

స్కూల్ గ్రామఫోన్ రికార్డుకి దేశభక్తి మరీ ఎక్కువైపోయి "అధినాయక... అధినాయక... అధినాయక.." అంటూ పాడిందే పాడ్డం మొదలెట్టేసరికి, జనగణమన అధినాయకుడైనటువంటి రామ్మూర్తికి కోపమొచ్చి తనే పాడ్డం ప్రారంభించాడు. ఆయనతో పాటు అందరూ పాడారు. ఆ తరువాత పిల్లలందరికీ పంతులమ్మల సాయంతో మిఠాయిలు పంచిపెట్టాడు రామ్మూర్తి.

కార్యక్రమమంతా ముగిశాక, కాస్సేపు హెడ్‌మిస్ట్రెస్ గదిలో కూర్చున్నాం. ఆ సందర్భంలో ఆవిడ రామ్మూర్తికి ఒక విజ్ఞప్తి చేసింది. స్కూల్‌కి ప్లేగ్రౌండ్ లేదట. చుట్టుప్రక్కల ఎక్కడన్నా స్థలమిప్పించమని వేడుకుంది. రామ్మూర్తి కాసేపు ఆలోచించి "ఓశ్! అదెంత పని?" అన్నాడు.

స్కూల్‌కి వెనకువైపు కాస్త ఎడంగా వంద, నూటయాభై దాకా గుడిసెలున్నాయి. ఆ స్థలమంతా మునిసిపాలిటీదట.

"ఈ కూలి నా కొడుకులంతా ఆళ్ళ బాబుగాడి సొత్తయినట్టు గుడిసెలేసేశారు. పీకించేసి ఇస్కూలు కిచ్చేత్తా..!" అని హెడ్‌మిస్ట్రెస్‌కి వాగ్దానం చేశాడు రామ్మూర్తి.

హెడ్‌మిస్ట్రెస్ కాఫీ ఇచ్చింది. తాగేసి కారెక్కి పోయాడు రామ్మూర్తి. హెడ్‌మిస్ట్రెస్ దగ్గర సెలవు తీసుకుని స్కూలు గేటు దాటి బయటికొచ్చాను.

స్వాతంత్ర్యదినోత్సవం స్కూల్లో వుంది. అక్కడక్కడా ఎగురుతున్న జెండాల్లో వుంది. రామ్మూర్తి ఉపన్యాసంలో వుంది. పంతులమ్మల ముస్తాబుల్లో వుంది. స్వీట్లకోసమొచ్చిన స్కూల్ పిల్లల్లో వుంది.

అంతే. ఇంకెక్కడా లేదు.

రోడ్డు మీద రొప్పుతూ, తొక్కలేక తొక్కలేక తొక్కుతున్న రిక్షావాడి మొహంలో లేదు. రోడ్డు పక్క చెప్పులు కుట్టే ముసలివాడిలో లేదు. మునిసిపాలిటీ చెత్త కుండీ దగ్గర చెత్తలో ఎందుకోసమో వెదుక్కుంటున్న ముష్టికుర్రాడి పదేళ్ళ పసిమొహంలో అసలు లేదు.

మా ఇల్లు స్కూల్‌కి దగ్గరే. మెల్లగా నడుచుకుంటూ బయల్దేరాను. స్కూల్ దాటాక ఆ వెనక వున్న గుడిసెల వేపు చూశాను. ఈ స్వాతంత్ర్యదినోత్సవమన్నది అక్కడసలే లేదు. గుడిసెలు ఎప్పటిలాగే ఇరుకు ఇరుగ్గా వున్నాయి. గుడిసెల్లో మనుషులు ఎప్పటిలాగే మురికి మురిగ్గా, చీదరగా, ఆకలిగా, అస్థిపంజరాల్లా వున్నారు. ఈ గుడిసెలన్నీ పీకేస్తే వీళ్ళంతా ఏమైపోతారోనన్న సందేహమొచ్చింది నాకు. సమాధానం దొరకలేదు.

★ ★ ★

వారం రోజుల తర్వాత సెకండ్ షో సినిమా చూసి వస్తున్న రామ్మూర్తిని ఎవరో పట్టుకుని ఎముకలోకి సున్నం లేకుండా చితకదన్నారు.

ఎవరు?

పదేళ్ళుగా నిరంతరమూ పీడించబడ్తున్న మునిసిపాలిటీ ఉద్యోగులా?

లంచాలివ్వలేక సతమతమవుతున్న చిల్లర వ్యాపారస్థులా?

మునిసిపల్ స్కూల్లో రెండొందల రూపాయల ఉద్యోగం కోసం పదేపదే వెరచబడుతున్న ఆడ టీచర్ల అన్నలా? భర్తలా?

లేకపోతే – గుడిసెల్లో పుట్టి, పెరిగి, అక్కడ బ్రతుకుతూ ఇన్నాళ్ళుగా బ్రతుకుతున్న గడ్డని ఖాళీ చేసి ఒక వంతు స్కూల్‌కి, మిగతా మూడువంతులూ ఛైర్మన్ బావమరది కట్టబోయే సినిమా హాల్‌కి ఇవ్వడం ఇష్టం లేని కూలిజనమా?

ఏమో, ఎవరైనా కావచ్చు.

రామ్మూర్తి దేశోద్ధరణకార్యక్రమాలకి అంతరాయం కలిగింది.

ఆవు 'అంబా' అనును.

పెద్దపులి గాండ్రించును.

రామ్మూర్తి ఆవు వేషం వేసుకున్న పెద్ద పులి!

O

*(జ్యోతి – మాసపత్రిక : దీపావళి ప్రత్యేక సంచిక – 1971)*